క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



కాకాణి గోవర్ధన్‌రెడ్డితో రజత్‌కుమార్‌రెడ్డి

కోవూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కోవూరు యువజన విభాగం అధ్యక్షుడు నల్లప రెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి బుధవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శివుని నరసింహారెడ్డి, ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, పార్టీ నేతలు కలువ బాలశంకర్‌రెడ్డి, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, లీగల్ సెల్ కోవూరు అధ్యక్షుడు చెంచురెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్ వెనుక మతలబేంటి..?

• అధికార పార్టీ నేతలపైనే అనుమానం



పంట కాలువలో పడి ఉన్న ఆయిల్ ట్యాంకర్

మనుబోలు: మండలంలోని కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో హైవే పక్కన పంట కాలువలో ఓ ఖాళీ ఆయిల్ ట్యాంకర్ నాలుగైదు నెలలుగా పడిపోయి ఉంది. ఇందులోని పామాయిల్‌ను దొంగలించి పిడుగురాళ్లలో విక్రయించిన ఆయిల్ దొంగల ముఠా, ఖాళీ ట్యాంకర్‌ను మనుబోలు మండల పరిధిలోని హైవే పక్కన పంట కాలువలో తోసేశారనే వదంతులు అప్పట్లోనే బలంగా వినిపించాయి. అయితే ఈ ఘటన వెనుక అధికార పార్టీ ముఖ్యనేత హస్తం ఉందని అనుమానిస్తున్నారు. వారి ఒత్తిడి మేరకే పోలీసులు అసలు నేరస్తులను వదిలేసి అమాయకులను జైళ్లకు పంపారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై సమగ్ర విచారణ జరిపితే ఆయిల్ మాఫియాతో పాటు దాని వెనకున్న అధికార పార్టీ నేతల గుట్టురట్టయ్యే అవకాశం ఉంది.

నేలటూరులో గ్రామసభ

ముత్తుకూరు(పొదలకూరు): కాలుష్య కోరల్లో చిక్కుకున్న మండలంలోని నేలటూరు గ్రామ తరలింపుపై గ్రామసభను నెల్లూరు ఆర్డీఓ అనూష బుధవారం ఏర్పాటు చేశారు. గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు వినతులను అందజేశారు. తొమ్మిదేళ్లుగా గ్రామాన్ని తరలించలేదని, ఇళ్ల సంఖ్య పెరిగిన తరుణంలో గృహ నిర్మాణాలకు సంబంధించి తిరిగి అంచనాలు రూపొందించాలని కోరారు. పునరావాస కేంద్రాల్లోని ఇళ్లకు వ్యక్తిగత ప్రహరీలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఇంటికీ నోటీసును అందజేయాలని, 2013 ఆర్ అండ్ ఆర్ యాక్ట్ ప్రకారం తరలించాలని కోరారు. తహసీల్దార్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పొదలకూరు: ఆదూరుపల్లి 132 కేవీ సబ్‌స్టేషన్లో ఫీడర్ నిర్వహణ దృష్ట్యా మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం ఏర్పడనుందని పొదలకూరు డీఈ సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీపట్నం, విరువూరు, తాటిపర్తి సబ్‌స్టేషన్ల ఎస్‌ఎంసీ ఫీడర్, కిసాన్ క్రాఫ్ట్ పరిశ్రమకు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని వివరించారు.

కాలంచెల్లిన ఆహార పదార్థాల సీజ్

నెల్లూరు(బారకాసు): కాలం చెల్లిన పలు ఆహార పదార్థాలను ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించి సీజ్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. ఓ వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ అధికారి వెంకటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి నగరంలోని వేదాయపాళెంలో ఉన్న రిలయన్స్ స్మార్ట్ షోరూమ్‌లో పలు ఆహార పదార్థాలను బుధవారం తనిఖీ చేశారు. తనిఖీల్లో పలు ఆహార పదార్థాలను కాలం చెల్లినవిగా గుర్తించి వాటిని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ 2006 ప్రకారం సీజ్ చేశామని, అలాగే తదుపరి చర్యలు చేపడతామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రణతిఫ్లోరాతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాబ్ పరీక్షలు పక్కాగా ఉండాలి

నెల్లూరు(అర్బన్): వైద్యశాఖ పరిధిలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు రోగులకు చేస్తున్న టీబీ, రక్త తదితర పరీక్షలను పక్కాగా నిర్వహించాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. సంతపేటలోని వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో అన్ని పీహెచ్‌సీలు, జీజీహెచ్‌లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. క్షయ నివారణకు కేంద్ర ప్రభుత్వం టీబీ ముక్త భారత్ అనే కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా గతంలో టీబీ వచ్చిన వారి సన్నిహితులు, స్మోకర్స్, డయాబెటిక్‌తో ఉన్న వారు, పోషకాహారం లోపంతో బాధపడుతున్న వారు, హెచ్‌ఐవీతో బాధపడుతున్న వారిని గుర్తించి క్షయ పరీక్షలు నిర్వహించాలన్నారు.

రక్షణగోడ సరే.. ఆక్రమణల సంగతేంటి

• గుడిపల్లి కాలువపై అక్రమ నిర్మాణాలు
• చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



గుడిపల్లి కాలువను ఆనుకొని ఉన్న నిర్మాణాలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని గుడిపల్లి కాలువపై రక్షణగోడ నిర్మించేందుకు రూ.50 లక్షలు మంజూరు చేస్తామని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి బుధవారం ప్రకటించారు. అయితే ఈ కాలువ వెంబడి ఉన్న అక్రమ నిర్మాణాల సంగతి మాత్రం పట్టించుకోవడం లేదు. టీడీపీ సానుభూతిపరులే ఆక్రమణలు చేపట్టడంతో ఆమె స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆమె 11వ వార్డులో పర్యటించిన సందర్భంగా గుడిపల్లి కాలువ వల్ల వరద వస్తోందని స్థానికులు తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో కాలువ పొంగితే ఇళ్లలోకి మురుగునీరు చేరి వారంరోజుల పాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే కాలువ పొంగకుండా, వరదను ఆపేందుకు కాలువకు ఇరువైపులా గోడ నిర్మాణం చేపడతామని వారికి హామీ ఇచ్చారు.

యథేచ్ఛగా నిర్మాణాలు

గుడిపల్లి కాలువకు ఇరువైపులా రక్షణగోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చెప్పినా.. స్థానిక ప్రజలు మాత్రం ముందు కాలువ పొడుగునా ఉన్న అక్రమ నిర్మాణాలు తొలగిస్తే బాగుంటుందని అంటున్నారు. పొరుదల కాలువను ఆక్రమించి కాంక్రీటు నిర్మాణాలు యథేచ్ఛగా నిర్మించినా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టకుండా చోద్యం చూస్తున్నారు. బుధవారం ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా వరద రాకుండా అడ్డుగా గోడలు నిర్మిస్తామని చెప్పారే తప్ప, అక్రమ నిర్మాణాల గురించి ఒక్క మాట మాట్లాడలేదు. అడుగడుగునా అక్రమ నిర్మాణాలు కంటికి కనిపిస్తున్నా వాటి గురించి ప్రస్తావించలేదు. అక్రమ కట్టడాలు తొలగించకుండా గోడలు నిర్మించినా ఎలాంటి ఉపయోగం ఉండదని, ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాలువ ఎంత వెడల్పు ఉందో సర్వేచేసి, అక్రమ నిర్మాణాలు తొలగించి కాలువకు గోడలు నిర్మిస్తే సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుంది. లేనిపక్షంలో నిధులు వృథా తప్పితే ఎలాంటి ప్రయోజనం ఉండదు. కాలువపై అక్రమ నిర్మాణాలు టీడీపీ కౌన్సిలర్లకు చెందిన సానుభూతిపరులకు చెందినవి కావడంతో కౌన్సిలర్లు కూడా ఈ విషయాన్ని ఎమ్మెల్యే వద్ద ప్రస్తావించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తానికి కాలువపై గోడలు నిర్మించి మమ అనిపిస్తారో లేక అక్రమ నిర్మాణాలు తొలగించి శాశ్వత పరిష్కారం చూపుతారో వేచి చూడాల్సిందే.

రైతు గ్రూపులకు రాయితీపై డ్రోన్‌లు



కొడవలూరు: డ్రోన్ల వినియోగంపై గండవరంలో అవగాహన



విడవలూరు: అధికారుల క్షేత్ర సందర్శన

కొడవలూరు: రైతు గ్రూపులకు 80 శాతం రాయితీతో డ్రోన్ పరికరాలు ఇస్తోందని కోవూరు ఏడీఏ జి.అనిత తెలిపారు. మండలంలోని గండవరం, నాయుడుపాళెంలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా డ్రోన్ల ప్రయోజనాలపై బుధవారం ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడి వారిలో ఒకరు ఇంటర్మీడియట్ విద్యార్హత ఉంటే 80 శాతం రాయితీపై డ్రోన్ పరికరాలు ఇస్తోందన్నారు. తొలుత ఆ గ్రూపులోని రైతులకు డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇచ్చి తదుపరి అందజేస్తారన్నారు. రైతు వాటా కింద రూ.2 లక్షలు చెల్లిస్తే రూ.7.80 లక్షల బ్యాంక్ ద్వారా రుణం మంజూరు చేసి డ్రోన్లను ఇస్తామన్నారు. బ్యాంక్ ఇచ్చే రుణం మొత్తాన్ని ప్రభుత్వం రాయితీ కింద ఇస్తారన్నారు. డ్రోన్ల వల్ల వ్యవసాయంలో బహుళ ప్రయోజనాలున్నాయని తెలిపారు. వీటి ద్వారా నానో యూరియా, నానో డీఏపీ, పురుగు మందులు, కలుపు మందులు పొలానికి పిచికారీ చేసుకొని అత్యంత తక్కువ వ్యవధిలో తెగుళ్లు, పురుగులు, కలుపు నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ ఎస్.విజయలక్ష్మి, ఏఈఓ వెంకట్రావు, వీపీఏలు ప్రసాద్, కామాక్షి, రైతులు పెనాక వెంకటేశ్వర్లురెడ్డి, తిరుపాలురెడ్డి పాల్గొన్నారు.

పంట నమోదుపై అవగాహన

విడవలూరు: రైతులందరూ తప్పకుండా ఈ–పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మి అన్నారు. మండలంలోని దండిగుంట, వావిళ్ల గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆమె బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు రైతులు సీసీఆర్ కార్డులు పొందాలన్నారు. అనంతరం గ్రామాల్లోని పలువురు రైతుల పొలాలను పరిశీలించి వారికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో వరిణి సర్పంచ్ మల్లికార్జున, వీపీఏలు వర్షిత రాజ్, అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని మలిదేవి కాలువ వద్ద ఫైర్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. త్వరలో ఫైర్ స్టేషన్ను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. దీని నిర్మాణం పూర్తయితే అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు త్వరితగతిన ఘటనా స్థలానికి చేరుకునేందుకు వీలు ఉంటుందన్నారు. ఆమె వెంట అగ్నిమాపకశాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మానేగుంటపాడులో నేత్ర వైద్య శిబిరం



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న ప్రసన్నరెడ్డి

కొడవలూరు: మండలంలోని మానేగుంటపాడులో పొలిచర్ల జనార్దన్‌రెడ్డి, శారదమ్మ, పొలిచర్ల శ్రీనివాసులురెడ్డిల జ్ఞాపకార్థం పారిశ్రామిక వేత్త పీవీ ప్రసన్నరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 200 మందికి కంటి పరీక్షలు చేసి పలువురికి కంటి అద్దాలు అందజేశారు. కంటి సమస్య తీవ్రంగా ఉన్న వారిని ఉచిత కంటి శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. ఈ శిబిరాన్ని పీవీ ప్రసన్నరెడ్డి ప్రారంభించగా వాసన్ ఐ కేర్ వైద్య బృందం కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు కారెంపూడి సుబ్బరామిరెడ్డి, నీలకంఠం శ్రీధర్‌రెడ్డి, బద్వేలు వినీల్‌రెడ్డి, పెళ్లకూరు సురేంద్రరెడ్డి, వాసా గోపాల్‌రెడ్డి, పెళ్లకూరు జనార్దన్‌రెడ్డి, గునపాటి మల్లికార్జునరెడ్డి, పి.మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విత్తనశుద్ధి ఎంతో కీలకం



మాట్లాడుతున్న వెంకటకృష్ణయ్య

మనుబోలు: నారుమడులు వేసే ముందు నాణ్యమైన విత్తనలను ఎంపిక చేసుకోవడం, వాటిని శుద్ధి చేయడం ఎంతో కీలకమని నెల్లూరు జిల్లా వనరుల కేంద్ర ఏడీ దేవసేన పేర్కొన్నారు. మండలంలోని జట్లకొండూరులో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నీటి, ఎరువుల యాజమాన్యం, విత్తనశుద్ధి, విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించిన అనంతరం ఏఓ వెంకటకృష్ణయ్య మాట్లాడారు. రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలను జరిపించి నేల స్వభావానికి అనుగుణంగా పంటల సాగు, ఎరువులను వినియోగించాలని సూచించారు. జీలుగ, పిల్లిపెసర, జనుము తదితర పచ్చరొట్ట పంటలను సాగు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చన్నారు. రసాయన ఎరువుల వినియోగంలో నియంత్రణ పాటించి, వాటి స్థానంలో సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

గుర్తుతెలియని వ్యక్తులతో భయాందోళనలు



మాట్లాడుతున్న గ్రామస్తులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి భయాందోళనలకు గురిచేస్తున్నారని గ్రామస్తులు బుధవారం విలేకరులకు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామంలో ఓ మతానికి సంబంధించిన సంస్థలో గుర్తుతెలియని వ్యక్తులు ఉన్నారని పోలీసులకు సమాచారం అందించామన్నారు. పోలీసులు వచ్చి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని వివరాలు అడగ్గా పొంతనలేని సమాధానాలు చెప్పారన్నారు. అతన్ని స్టేషన్‌కు తీసుకెళ్లి మళ్లీ వదిలేశారని వివరించారు. ప్రతి శుక్రవారం రెండు వాహనాల్లో ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి కొంత మంది వ్యక్తులు ఇక్కడికి వచ్చి రాత్రంతా ప్రార్థనలు చేస్తుంటారని, తమ మతంలో చేరమని ప్రచారం చేస్తుంటారని పేర్కొన్నారు. గ్రామంలో ఇలా మతపరమైన విద్వేషాలు రెచ్చగొడుతున్నారన్నారు. ఇవే కాక ఏవేవో రహస్య మంతనాలు జరుపుతుంటారని, వారిని చూస్తే అనేక అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. గ్రామంలో భయం భయంగా బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనిపై పోలీసులు నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

6న మండల సర్వసభ్య సమావేశం

పొదలకూరు: మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ సుబ్బరాయుడు అధ్యక్షతన ఈ నెల ఆరున నిర్వహించనున్నామని ఎంపీడీఓ నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులపై చర్చించనున్నామని, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

వేడుకగా కాంతమ్మతల్లి ఆరాధనోత్సవం



పొదలకూరు: మండలంలోని ఇనుకుర్తి పంచాయతీలోని కాంతమ్మ తల్లి ఆశ్రమంలో ఆరాధనోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఇనుకుర్తి, ముదిగేడు, గేడపూడిలో గ్రామోత్సవాన్ని జరిపారు. భక్తులకు అన్నదానం చేశారు. అఖండ భజనను నిర్వహించారు. ఇంద్రజాల, భరతనాట్య ప్రదర్శనలను ఏర్పాటు చేశారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

తోటపల్లిగూడూరు: మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండపం పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపనను బుధవారం ఆయన చేపట్టారు. జాఫర్‌సాహెబ్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తోటపల్లి గూడూరు సొసైటీ చైర్మన్ సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, కొణతం రఘుబాబు, తాండ్ర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ పాలకమండలి ప్రమాణ స్వీకారం

పొదలకూరు: పీఏసీఎస్ పాలకమండలి ప్రమాణ స్వీకారాన్ని స్థానిక సొసైటీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హాజరయ్యారు. చైర్మన్‌గా మస్తాన్‌బాబు, డైరెక్టర్లుగా భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున ప్రమాణ స్వీకారం చేశారు. ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ శివప్రసాద్, ఏపీ కనీస వేతన బోర్డు చైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం శంకుస్థాపన గావించారు. రూ.65 లక్షలతో యల్లాయపాళెం మెయిన్ రోడ్డు, రూ.10 లక్షలతో ముస్లిం కాలనీలో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేశారు. యల్లాయపాళెం ప్రధాన గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించిన అంతర్గత రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ నివేశన స్థలం మంజూరుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు జీవీఎన్ శేఖర్‌రెడ్డి, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, కేతు వెంకటరమణారెడ్డి, వంశీధర్‌రెడ్డి, జి.రాజా, బి.విజయ్‌కుమార్, బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్సీలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇవ్వాలి

నెల్లూరు(పొగతోట): రాష్ట్రంలో ఎస్సీలకు 50 ఏళ్లకు పింఛన్లు మంజూరు చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజాసత్త నాయకుడు శోభన్‌బాబు కోరారు. ఈ మేరకు నగరంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారికి బుధవారం వినతి పత్రం సమర్పించారు.

కోలాహలంగా నిమజ్జనం



మనుబోలు: గ్రామోత్సవంలో బొజ్జ గణపయ్య



ముత్తుకూరు: బ్రహ్మదేవంలో అన్నదానం



కొడవలూరు: నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు

మనుబోలు: వినాయక చవితి సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్య విగ్రహాలకు గ్రామోత్సవాలను నిర్వహించి సమీపంలోని వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేస్తున్నారు. మనుబోలు సాయిబాబా మందిరం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి గ్రామోత్సవాన్ని అంగరంగవైభవంగా మంగళవారం నిర్వహించారు. లడ్డూను వేలం వేయగా, రూ.1.05 లక్షలకు కామిశెట్టి సోదరులు దక్కించుకున్నారు. వినాయకుడి విగ్రహంపై వేసిన రూ.50 నోట్ల మాలను రూ.64 వేలకు వాలేటి నారాయణ, స్వామివారి వెండి నాణేన్ని రూ.55 వేలకు తరుణ్ గుప్తా దక్కించుకున్నారు. ముఖ్యఅతిథులుగా ఎస్సై శివరాకేష్, పంచాయతీ కార్యదర్శి గరుడయ్య హాజరయ్యారు. గ్రామ సమీపంలోని కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు.

• **ముత్తుకూరు(పొదలకూరు)** : మండలంలోని బ్రహ్మదేవం పంచాయతీ గురవయ్యశాలలో వినాయక చవితి వేడుకలను నిర్వహించారు. ప్రత్యేక పూజలను నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. విశేషాలంకారంలో ఉన్న గణనాథుడ్ని భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. దయాకర్, చిన్నయ్య, శీనయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

• **కొడవలూరు:** మండలంలోని గండవరంలో ప్రతిష్ఠించిన గణనాథుని ప్రతిమకు బుధవారం రాత్రి ఘనంగా నిమజ్జనోత్సవం నిర్వహించారు. యువకులు రంగులు చల్లుకొంటూ డాన్స్‌లు చేస్తూ ఉత్సాహంగా గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. కమిటీ సభ్యులు ఆలం మాలకొండయ్య, పెనాక వెంకటేశ్వర్లురెడ్డి పర్యవేక్షించారు.

• **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** మండలంలోని జొన్నవాడ హరిజనవాడలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉట్టి మహోత్సవం వేడుకగా జరిగింది. వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా ఉట్టిని సుందరంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. అనంతరం యువత ఉట్టి కొట్టి సంబరాలు జరుపుకున్నారు.



మనుబోలు: పూజలందుకుంటున్న గణనాథుడు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడ దళితవాడలో..

పోషకాహార ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ



కొడవలూరు: మండలంలోని రేగడిచెలిక గిరిజన కాలనీలో పోషకాహార ఆవశ్యకతపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ మాట్లాడుతూ గర్భిణులు పోషకాహార లోపం తలెత్తకుండా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలుండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, జామకాయ, వేరుశనగ చిక్కీ, బెల్లం, పాలకూర, పొనగంటాకు తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డా ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎ.అమరావతి, హెల్పర్ లావణ్య పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో మెరుగైన వైద్యం



సీహెచ్‌సీని పరిశీలిస్తున్న పరిమళ

వెంకటాచలం: స్థానిక క్లస్టర్ ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్యసేవలందించేందుకు చర్యలు చేపడతామని డీసీహెచ్‌ఎస్ పరిమళ పేర్కొన్నారు. వెంకటాచలంలోని క్లస్టర్ ఆరోగ్య కేంద్రంలో రోగులకు సరైన వైద్యసేవలను అందించడంలేదనే ఆరోపణలొస్తున్న నేపథ్యంలో ఆకస్మికంగా బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. అన్ని వార్డుల్లో తిరిగి అక్కడ ఉన్న రోగులతో ముచ్చటించారు. పలు రికార్డులను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. సమయపాలనను వైద్యులు, సిబ్బంది తప్పక పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఎంఈఓకు సత్కారం



వెంకటాచలం: వెంకటాచలం ఎంఈఓగా నియమితులైన సుధీర్ ప్రేమ్‌కుమార్‌ను ఏపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చేవూరు సుబ్బారావు, మండల గౌరవాధ్యక్షుడు గుర్రం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిడిముసలి పీఏసీఎస్ చైర్మన్‌గా వినీల్‌రెడ్డి



ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్, సభ్యులు

ఇందుకూరుపేట: నిడిముసలి సహకార బ్యాంక్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా చిరమన వినీల్‌రెడ్డి, సభ్యులుగా పి.శ్రీనివాసులు, ఉడతా సాయికృష్ణ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ బ్యాంక్ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ



కావూరు: మండలంలోని గంగవరం గ్రామంలో రైతులకు బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతీరెడ్డి అధిక మోతాదులో యూరియా వాడకం వల్ల కలిగే అనర్థాలను రైతులకు వివరించారు. జీవ ఎరువుల ప్రాముఖ్యతను తెలియజేశారు.